సాక్షి
తిరుపతి
శనివారం : 27 : సెప్టెంబర్ : 2025



బ్రహ్మోత్సవాలకు హాజరైన అశేష భక్తజనం



సింహవాహనంపై శ్రీవారు

సింహాసన యోగం.. ముత్యాల మురిపెం



ముత్యపు పందిరిపై మలయప్ప స్వామి

ఇల వైకుంఠంగా అలరారుతున్న తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామి శుక్రవారం ఉదయం సింహ వాహనంపై యోగ నృసింహుడి రూపంలో దర్శనమిచ్చారు. రాత్రి శ్రీ మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవితో కలిసి కాళీయ మర్దనుడి అలంకారంలో ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. శ్రీకృష్ణుడు ముక్కుపై, మెడలో ముత్యాల ఆభరణాలు ధరించినట్టు పురాణాల్లో ఉంది. ఆదిశేషుని పడగలను ముత్యాల గొడుగా పూనిన స్వామివారిని దర్శించినా, స్తోత్రం చేసినా సకల శుభాలు కలుగుతాయని పురాణ ప్రశస్తి. చల్లని ముత్యాలకింద నిలిచిన శ్రీనివాసుని దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూర్చుతుంది. - తిరుమల



వాహన సేవలో పాల్గొన్న కళాకారుల నృత్య ప్రదర్శన

న్యూస్‌రీల్

వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా కమిటీల ఎంపిక

తిరుపతి కల్చరల్: వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన వివిధ విభాగ కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈమేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్‌ఆర్‌టీయూసీ విభాగం కార్యదర్శిగా తిరుపతికి చెందిన షేక్ మహ్మద్ రఫీ నియమితులయ్యారు. జిల్లా యూత్ విభాగం సభ్యుడుగా నగరి అసెంబ్లీ నియోజకవర్గానికి పి.హరి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శిగా కె.మనోహర్‌రెడ్డి, జిల్లా ఆర్‌టీఐ విభాగం ప్రధాన కార్యదర్శిగా డి.రాజగోపాల్, జిల్లా ఆర్‌టీఐ విభాగం సభ్యుడుగా జి.కృష్ణమూర్తి , జిల్లా ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా బి.లక్ష్మీపతి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం సభ్యుడుగా ఎస్.సెల్వరాజు, జిల్లా వైఎస్‌ఆర్‌టీ యూసీ సభ్యుడిగా పాండియన్, జిల్లా గ్రీవెన్స్ సెల్ సభ్యుడుగా భాస్కర్‌రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శిగా నరపరాజు, జిల్లా మున్సిపల్ విభాగం సభ్యుడుగా రాజేంద్ర నియమితులయ్యారు.

గరుడసేవకు ద్విచక్రవాహనాల రాకపోకలు రద్దు

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబరు 28న గరుడ సేవ నాడు విశేషంగా భక్తులు తిరుమలకు చేరుకుంటారు. ఘాట్ రోడ్లలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సెప్టెంబరు 27న సాయంత్రం 6 గంటల నుంచి సెప్టెంబరు 28 ఉదయం 6 గంటల వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలను టీటీడీ రద్దు చేసినట్లు తెలిపింది. తిరుపతిలోని అలిపిరి పాత చెక్ పాయింట్ వద్ద ద్విచక్ర వాహనాలను పార్క్ చేసుకునే సదుపాయాన్ని టీటీడీ కల్పిస్తోంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీకి సహకరించాల్సిందిగా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నేడు ఐఐటీ ఫేజ్-బీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- వర్చువల్‌గా భూమిపూజ చేయనున్న ప్రధాని మోదీ



తిరుపతి ఐఐటీ ప్రధాన ప్రవేశ ద్వారం

ఏర్పేడు : తిరుపతి ఐఐటీ శాశ్వత క్యాంపస్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఫేజ్-బీ పనులకు శనివారం భారత ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో భూమి పూజ చేయనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఐఐటీ అభివృద్ధికి ఫేజ్-బీ కింద రూ.2,313 కోట్లు నిధులు కేటాయించింది. ఫేజ్-ఏలో ఇప్పటికే రూ.1,444 కోట్లు ఖర్చు చేయగా, ఫేజ్-బీ నిధులతో మరింతగా ఐఐటీ శాశ్వత ప్రాంగణం అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తితో పాటు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరు కానున్నారు.

దౌర్జన్యాల టెండర్!



తిరుపతి నగర పాలక సంస్థలో పనులకు సంబంధించిన టెండర్లు దౌర్జన్యాలతో కూటమి నేతలే వశం చేసుకుంటున్నారు. అలా కాదని వేరొకరు టెండర్లు వేసి దక్కించుకుంటే మాత్రం ఆ కాంట్రాక్టర్‌పై దాడులకు తెగబడుతున్నారు. తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో అధికారి ముందే జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనపై బాధితులు ఎవ్వరికీ ఫిర్యాదు చేయకుండా కూటమి నేతలు, అధికారులు భయపెట్టి నోరు మూయించినట్లు సమాచారం.

కార్పొరేషన్‌లో కూటమి రౌడీయిజం

- అభివృద్ధి పనుల టెండర్లన్నీ కూటమి శ్రేణులకే
- అర్హత లేకపోయినా నేతలు చెప్పిన వారికే టెండర్
- వేరొకరు వేసినా వారిని బెదిరించి ఉప సంహరింపజేస్తున్న నేతలు
- ఫిర్యాదు చేయకుండా కాంట్రాక్టర్లతో లేఖ రాయించుకుంటున్న వైనం
- కోర్టు ద్వారా టెండర్ దక్కించుకున్నందుకు ఓ కాంట్రాక్టర్‌ను చితకబాదిన కూటమి నేతలు
- తిరుపతి కార్పొరేషన్‌లో పనులకు టెండర్ వేయాలంటే భయపడుతున్న కాంట్రాక్టర్లు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : తిరుపతి నగర పరిధిలోని కొరమేనుగుంటలో మురుగు కాలువ నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. అందరితో పాటు ఓ కాంట్రాక్టర్ కూడా టెండరు వేశాడు. టెండర్ ఓపెన్ చేస్తే ఆ వ్యక్తికే దక్కుతుందని కూటమికి చెందిన నాయకుడు తెరవకుండా ఆలస్యం చేయించారు. విషయం తెలుసుకున్న ఆ కాంట్రాక్టర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఫలితంగా టెండర్ ఓపెన్ చేయక తప్పలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు టెండర్ ఆ కాంట్రాక్టర్‌కే దక్కింది. పనులు మొదలు పెట్టారు. తమను కాదని టెండర్ దక్కించుకోవటాన్ని జీర్ణించుకోలేని కూటమి నాయకుడు మురుగు కాలువ నిర్మాణ పనులకు కూలీలను ఎవ్వరినీ వెళ్లకుండా అడ్డుకున్నారు. పనులు కూడా కొద్ది రోజులుగా ఆగిపోయాయి.

బెదిరించి భయపెట్టి..

తిరుపతి నగర పాలక సంస్థలో టెండర్లు దక్కించుకోవాలంటే కూటమి శ్రేణులై ఉండాలి. అర్హత ఉన్నా లేకపోయినా వారికే దక్కుతాయి. కూటమి శ్రేణులకు కాకుండా ఎవరు టెండర్ దక్కించుకున్నా బెదిరించి, భయపెడుతారు. అనారోగ్య కారణాలతో టెండర్‌ను ఉప సంహరించుకుంటున్నట్లు లేఖలు రాయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలో ఇటీవల సుమారు రూ.15.11 కోట్ల పనులకు సంబంధించి టెండర్లు ఆహ్వానించారు. ఈనెల 3వ తేదీలోపు టెండర్లు దాఖలు చేయాలని ప్రకటించారు. అందులో భాగంగా అనేక మంది ఆన్‌లైన్ ద్వారా టెండర్‌లు దాఖలు చేశారు. అర్హత లేని వారు కూడా టెండర్లు దాఖలు చేశారు. నిబంధనల గురించి తెలిసిన కాంట్రాక్టర్లు కొందరు ఎక్కువ చేస్తే, మరి కొందరు తక్కువకు కోట్ చేశారు. టెండర్లు ఎవరికి దక్కుతాయో తెలుసుకున్న కూటమి నేతలు ఆయా కాంట్రాక్టర్ల వద్దకు వెళ్లడం, మరి కొందరిని కార్పొరేషన కార్యాలయానికి పిలిపించినట్లు తెలిసింది. కూటమి శ్రేణుల కోసం చెప్పిన తేదీకి టెండర్ ఓపెన్ చేయకుండా పెండింగ్ పెట్టించిన దాఖలాలు కూడా ఉన్నాయి. కాంట్రాక్టర్లను నయానో, భయానో బెదిరించినట్లు కార్పొరేషన్‌లోని అధికారి ఒకరు వెల్లడించారు. కూటమి శ్రేణుల బెదిరింపులకు భయపడి అనేక మంది కాంట్రాక్టర్లు టెండర్లను ఉప సంహరించుకుంటున్నట్లు తెలిసింది. ఉప సంహరించుకున్న కాంట్రాక్టర్ రకరకాల కారణాల చేత తప్పుకుంటున్నట్లు లెటర్ రాయించుకున్నట్లు తెలిసింది. అలా లేఖ రాసివ్వకపోతే వారిపై దాడులు చేయడం . అయినా టెండర్ దక్కించుకుని పనులు మొదలు పెడితే కార్మికులను రాకుండా అడ్డుకోవడం వంటి దౌర్జన్యాలకు తెరతీసినట్లు తిరుపతి నగరంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

కూటమి నేతలు ఎవరు చెబితే వారికే..

టెండర్ల విషయంలో కూటమి శ్రేణులు ఎలా చెబితే అధికారులు అలా తలూపటం చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులకు సంబంధించి మెటీరియల్ కొనుగోలు టెండర్ దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్‌ను కూటమి నేతలు తీవ్ర ఇబ్బందులు పెట్టినట్లు సమాచారం. ఆ టెండర్‌ను టీడీపీ నేత తన అనుచరుడికి ఇప్పించాలని పట్టుబట్టారు. అందులో భాగంగా ఆ కాంట్రాక్టర్‌ను సంప్రదించారు. ఆ కాంట్రాక్టర్ కాస్త బలవంతుడు కావడంతో ససేమిరా అన్నాడు. టెండర్ మొత్తం ఒక్కరికే కాకుండా రెండుగా విడగొట్టేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న ఆ కాంట్రాక్టర్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అధికార పార్టీ నాయకుడు టెండర్ ఓపెన్ చేయకుండా గడువు పొడిగించారు. కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడంతో ఆ కాంట్రాక్టర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించి టెండర్ దక్కించుకున్నట్లు సమాచారం.

అధికారుల ముందే దాడి

పనులకు రాకుండా అడ్డుకున్న విషయంపై ఆ కాంట్రాక్టర్ తిరుపతి కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని సంబంధిత అధికారికి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న కూటమి శ్రేణులు అధికారుల ముందే ఆ కాంట్రాక్టర్‌పై దాడి చేశారు. ఉన్నతాధికారి ముందే దాడి జరిగినా ఎవ్వరూ ఆపే ప్రయత్నం చేయలేదు. మూడు నాలుగు రోజుల తరువాత బాధితుడు వేసిన టెండర్‌కు అర్హత లేదని తిరస్కరించి టీడీపీ కాంట్రాక్టర్‌కే కట్టబెట్టినట్లు కార్పొరేషన్ కార్యాలయంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దాడి చేసినట్లు, బెదిరించినట్లు ఎవరికైనా ఫిర్యాదు చేస్తే అంతు చూస్తామని తీవ్ర స్థాయిలో బెదిరించినట్లు విశ్వసనీయ సమాచారం.

చిత్తూరు కార్పొరేషన్‌లోనూ..

చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలోనూ వివిధ పనులకు సంబంధించి టెండర్లు ఆహ్వానించారు. అన్ని పనులకు కూటమి పార్టీలకు చెందిన వారే టెండర్లు వేయించేలా చర్యలు తీసుకున్నారు. ఒక పనికి టీడీపీ, బీజేపీ, జనసేన సానుభూతి పరులు టెండర్లు వేస్తారు. ముగ్గురు ఒక్కటై పనులను పంచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. కూటమి పార్టీలకు చెందిన వారు కాకుండా వేరొకరు టెండరు దాఖలు చేస్తే వారిని బెదిరించి ఉప సంహరించుకుంటున్నట్లు లేఖలు రాయించుకుంటుండడం ఆందోళన కలిగిస్తోంది.

గరుడసేవకు ట్రాఫిక్ మళ్లింపు

- పోలీసులు, టీటీడీకి సహకరించాలి

తిరుపతి అర్బన్ : తిరుమల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆదివారం గరుడవాహనం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నగరంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆర్టీసీ సర్వీసులతో పాటు టీటీడీ ప్రత్యేక బస్సులు తిరుపతి నుంచి తిరుమలకు నిత్యం నడపనున్నారు. అలిపిరి-కపిలతీర్థం మార్గంలో భక్తుల రాకపోకల కోసం ప్రత్యేకంగా ఉంచడం జరుగుతుందన్నారు. ప్రైవేటు వాహనాలకు కేటాయించిన ప్రదేశంలో మాత్రమే పార్కింగ్ చేయాలి. వీధి వ్యాపారులకు ప్రధాన రహదారులపై వ్యాపారాలకు అనుమతి రద్దు చేశారు.

తిరుపతిలో ద్విచక్ర వాహనాల పార్కింగ్

- శనివారం (27 తేదీ) రాత్రి 9 గంటల నుంచి సోమవారం (29వతేదీ) ఉదయం 6 గంటల వరకు అలిపిరి ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదు.
- కడప, శ్రీకాళహస్తి వైపు నుంచి వచ్చే వాహనాలకు ఇస్కాన్ గ్రౌండ్, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్, భారతీయ విద్యాభవన్ గ్రౌండ్‌లో టూ వీలర్, ఫోర్ వీలర్ పార్కింగ్ సదుపాయం కల్పించారు.
- చిత్తూరు, పీలేరు మరియు ఇతర జిల్లాల నుంచి వచ్చే టూరిస్టు వాహనాలు, టెంపో ట్రావెల్స్ వాహనాలకు దేవలోక్ ప్రాంగణంలో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు.
- మదనపల్లి, చిత్తూరు నుంచి వచ్చే వాహనాలకు భారతీయ విద్యాభవన్, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్, ఇస్కాన్ టెంపుల్ గ్రౌండ్‌లో ఫోర్ వీలర్ పార్కింగ్ సదుపాయం కలదు.
- గరుడ సేవకు టూ వీలర్లలో వచ్చే యాత్రికులకు అలిపిరి బాలాజీ లింక్ బస్టాండ్ వద్ద టూ వీలర్ పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు.
- కరకంబాడి వైపు నుంచి వచ్చే వాహనాలకు ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద కట్-ఆఫ్ పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- మదనపల్లి, చిత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు వకులమాత ఆలయం, చెర్లోపల్లి వద్ద పార్కింగ్ సదుపాయం కలదు.
- పుత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు మ్యాంగో మార్కెట్ నందు పార్కింగ్ సదుపాయం.
- చిత్తూరు, మదనపల్లి వైపు నుంచి.. తిరుపతి లోపలికి వచ్చే ఆర్టీసీ బస్సులు కాలూరు క్రాస్ మీదుగా, ఆర్‌సీపురం మీదుగా, తనపల్లి - గరుడ ఫ్లై ఓవర్ గుండా బస్ స్టాండ్‌కు మళ్లింపు..
- తిరుమలకు ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణించే యాత్రికులు, నంది సర్కిల్ , గరుడ సర్కిల్ మార్గం గుండా యథా ప్రకారం తిరుమల వెళ్లనున్నారు.
- ఈ సందర్భంగా భక్తులకు తాగునీరు, భోజనం, టాయిలెట్స్ సదుపాయాలను కల్పించారు.

తిరుమలలో పార్కింగ్ ఏర్పాట్లు

- రాంభగీచ పార్కింగ్‌లో వీవీఐపీ పెద్ద బ్యాడ్జెస్ వాహనాలు
- సప్తగిరి గెస్ట్ హౌస్ పార్కింగ్- వీఐపీ చిన్న బ్యాడ్జెస్ వాహనాలు
- సాధారణ వాహనాలు- ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా కేటాయించిన పార్కింగ్ ప్రాంతాలకు పార్కింగ్ చేసుకోవాలి.

ప్లాట్లు వేసి..బేరం పెట్టి !





మేత పోరంబోకు భూమిలో అక్రమంగా నిర్మాణాలు సాగిస్తున్న దృశ్యం.. గతంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు (ఫైల్)

- పేదల ఇళ్లు కూల్చి పైశాచికం
- రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమి ఆక్రమణ
- ప్లాటు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు
- కూటమి నేతల బరితెగింపు

రేణిగుంట : రేణిగుంట-పాపానాయుడు పేట మార్గంలో రూ.కోట్ల విలువ చేసే మేత పోరంబోకు భూమి అక్రమార్కులపరం అవుతోంది. కూటమి నేతలు ప్లాట్లు వేసి బేరం పెట్టి ప్లాటు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల చొప్పున విక్రయించి అక్రమంగా దోచుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన స్థలాల్లో నివాసాలు నిర్మించుకున్న సుమారు 500 ఇళ్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేలమట్టం చేశారు. కానీ ఇదే కూటమి నాయకుల అండతో కోట్ల రూపాయలు విలువ చేసే 6 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

ముఖ్యనేత పీఏతో ఒప్పందం

రేణిగుంట మండలంలోని జీపాల్యం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 213/2 లో 1.8 ఎకరాలు, 213/3 లో 4.3 ఎకరాల ప్రభుత్వ పశువుల మేత పోరంబోకు భూమి ఉంది. రేణిగుంట- పాపా నాయుడుపేట ప్రధాన రహదారి పక్కన ఉండటంతో ఈ భూమికి మంచి డిమాండ్ ఉంది. ఈ భూమిపై కన్నేసిన కొందరు భూ ఆక్రమణదారులు గత ప్రభుత్వంలోనూ కబ్జాకు ప్రయత్నించారు. అయితే స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు ఆక్రమణలను అడ్డుకున్నారు. కట్టడాలను నేలమట్టం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అదే అక్రమ దారులు ఆ భూములపై కన్నేశారు. నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకుడి పీఏతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఆ తరువాత రెవెన్యూ అధికారుల సహకారం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందరి సహకారంతో వారం రోజులుగా నిర్మాణాలు ప్రారంభించారు. ఇప్పటికే ప్రభుత్వ 'మీ భూమి' వెబ్‌సైట్‌లో ప్రభుత్వ భూమిగానే నమోదయి ఉంది. అయితే తమకు కోర్టు ఆర్డర్ ఉందంటూ వెళ్లిన ప్రతి ఒక్కరికీ చెబుతూ అక్రమ నిర్మాణాలు శరవేగంగా చేపడుతున్నారు.

పేదల ఇళ్లు కూల్చేస్తూ..

పేద కుటుంబాలు తమ సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు గతంలో అధికారులు, స్థానిక ఎమ్మెల్యేని కలిసి విన్నవించుకున్నారు. అప్పటి ప్రభుత్వం వారికి అవకాశం కల్పించింది. అప్పులు చేసి నిర్మించుకున్న నివాసాలను కూటమి ప్రజాప్రతినిధి ఆదేశాలతో అధికారులు వాటిని నేలమట్టం చేశారు.

అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేశా

జీపాల్యం రెవెన్యూ గ్రామంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తన దృష్టికి వచ్చింది. వెంటనే సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పనులను నిలుపుదల చేశాను. కోర్టులో కేసు ఉన్నప్పుడు పనులు చేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటాం.

- చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్, రేణిగుంట



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,16,880
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.1,0,535
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,42,000
రిటైల్ వెండి గ్రాము	రూ.145.00

క్లుప్తంగా

గరుడ సేవకు కట్టుదిట్టమైన భద్రత

తిరుమల : ఈనెల 28వ తేదీ జరగనున్న శ్రీవారి గరుడ వాహనానికి పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం తిరుమల పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 4223 మందితో భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రోన్ కెమెరాలతో తిరుపతిలోని గరుడ సర్కిల్ అలిపిరి టోల్‌గేట్ పార్కింగ్ ప్రదేశాలను మానిటరింగ్ చేస్తున్నామన్నారు. దొంగతనాలు నియంత్రించేందుకు ఒక అదనపు ఎస్పీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి 300 మంది ప్రత్యేకమైన పోలీసులు కూడా తీసుకొచ్చామన్నారు. మాడా వీధులు నిండిన అనంతరం వేచి ఉన్న భక్తులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. తిరుమలలో 4000 వాహనాలకు పార్కింగ్ సదుపాయం ఉందని, తదుపరి వాహనాలు తిరుపతిలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలలో ఉంచి బస్సు ద్వారా ప్రయాణం చేయాలని సూచించారు.

22ఏ జాబితా నుంచి 631 ఎకరాల భూమి తొలగింపు

– శ్రీకాళహస్తి, కేవీబీపురం మండలాల్లో ఘటనలు

తిరుపతి అర్బన్ : శ్రీకాళహస్తి, కేవీబీపురం మండలాల్లో గ్రామకంఠం భూములు పరిధిలోని 19 వేల మందికి చెందిన 192 ప్లాట్స్, 631 ఎకరాల భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించినట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీతో పాటు పలు అంశాలను పరిశీలించి రెవెన్యూ అధికారులు ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ఈ భూములను ఇకపై రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలు ఉండదని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో డబుల్ ఎంట్రీలకు అవకాశం లేకుండా కచ్చితమైన వివరాలతో చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని ఇతర మండలాల పరిధిలోని గ్రామ కంఠానికి చెందిన 22ఏ భూములను కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 67,388 మంది తిరుమలేశుని దర్శించుకున్నారు. 21,998 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.1.74 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 16 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 3 గంటల్లో వెంకన్నను దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

ముత్యపు పందిరిపై మురిసె





సింహ వాహనంపై శ్రీవారు, వాహన సేవలో పాల్గొన్న చెవిరెడ్డి సోదరుడు రఘునాథరెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ముత్యపు పందిరిలో స్వామి

- వివిధ వాహన సేవల్లో కల్యాణ వెంకన్న కటాక్షం
- తుమ్మలగుంటలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలో జరుగుతున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సింహ వాహనంపై యోగ నరసింహుడి అలంకారంలో భక్తులను కటాక్షించేందుకు వచ్చిన స్వామికి ముందు వృషభాలు నడుస్తుండగా, భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, వేద పాఠశాల పిల్లలు కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ సింహ వాహన సేవ ఉత్సాహంగా సాగింది. ఉదయం యోగ నరసింహునిగా దర్శనమిచ్చిన స్వామి వారు రాత్రి ముత్యపు పందిరిలో కొలువై భక్తులను మురిపించారు.



వాహన సేవల్లో కోలాట ప్రదర్శన

సింహ వాహనం దర్శనంతోనే ధైర్యసిద్ధి

కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో మూడో రోజు శుక్రవారం ఉదయం యోగ నరసింహునిగా స్వామి వారు సింహ వాహనాన్ని అధిరోహించారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి , మహాధ్వనికి సంకేతం. సింహ రూప దర్శనంతో ధైర్యం, శక్తి, తేజస్సు వంటి శక్తులన్నీ భక్తులకు అందుతాయని విశ్వాసం.

ముత్యపు పందిరిలో కల్యాణ వెంకన్న

బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజైన శుక్రవారం రాత్రి ముత్యపు పందిరి వాహనంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడు కొలువై భక్తులను మురిపించారు. ముత్యపు పందిరిలో కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరుని దర్శనార్థం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

స్నపన తిరుమంజనం

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు నిర్వహించే తిరుమంజనం కమనీయంగా సాగింది. ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే తిరుమంజన సేవలో పాల్గొన్న భక్తులు భక్తితత్వంతో మైమరిచారు.

ఆకట్టుకుంటున్న నాదస్వరం

సింహ, ముత్యపు పందిరి వాహన సేవల్లో నాయీ బ్రహ్మణులు వినిపించే నాదస్వరం, ఆధ్యాత్మిక వాద్యం (డోలు వాయిద్యం) భక్తులను ఆకట్టుకుంటున్నాయి. దీనికి తోడు కోలాటాలు, చెక్క భజనలు కలసి రావడంతో వాహన సేవలు చూడ ముచ్చటగా సాగుతున్నాయి.

ఆయన కృషితోనే నైలెట్

- ఉపాధి అవకాశాల కోసం ఎంపీ వీరోచిత పోరాటం
- ఎట్టకేలకు ఎస్వీయూ నైలెట్ సంస్థ ఏర్పాటు అడుగులు
- వసతులు పరిశీలించిన ఎంపీ గురుమూర్తి

తిరుపతి సిటీ: ప్రతిష్టాత్మక విద్యాసంస్థ నేషనల్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థ (నైలెట్) తిరుపతి కేంద్రాన్ని అక్టోబర్ 2న ప్రారంభించనున్న నేపథ్యంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి శుక్రవారం ఆ కేంద్రాన్ని సందర్శించారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నైలెట్ ఏర్పాటుకు ఎంపీ పార్లమెంట్ వేదికగా పలుమార్లు గళం విప్పి సాధించారు. కేంద్ర ప్రభుత్వం, సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ చేసిన ప్రయత్నాల ఫలితంగా మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఈ నైలెట్ కేంద్రం ఎస్వీయూలో ఏర్పాటు కానుంది.

యువత ఉపాధే లక్ష్యంగా..

యువతకు పుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి నిరుద్యోగ అభ్యర్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వంతో పోరాడి నైలెట్ సంస్థను ఎస్వీయూలో ఏర్పాటు చేసేందుకు నిరంతర కృషి చేశారు. దీంతో ఈ సంస్థ ద్వారా యువతకు విభిన్న కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఐటీ కోర్సులతో పాటు వెబ్ డిజైనింగ్, పీసీ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, ఆఫీస్ ఆటోమేషన్, అకౌంటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి తక్కువ వ్యవధి కోర్సులు అందించనున్నారు. తిరుపతి ప్రాంత యువతకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ఎంబీడెడ్ సిస్టమ్ డిజైన్, సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ ఫోరెన్సిక్స్, సెమి కండక్టర్ డిజైన్, డేటా అనలిటిక్స్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.



నైలెట్ ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తున్న ఎంపీ

నైలెట్‌ని సందర్శించిన ఎంపీ

ఎస్వీయూలో ఏర్పాటు చేసిన నైలెట్ సంస్థను సందర్శించిన ఎంపీకి నైలెట్ డైరెక్టర్ అధ్యాపక సిబ్బందిని పరిచయం చేశారు. అనంతరం ఆయన క్లాస్ రూమ్స్‌ని, ల్యాబ్స్‌ని పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతున్న విషయం గమనించిన ఎంపీ దాని గురించి ఆరా తీయగా మరుగుదొడ్ల ఇబ్బంది కారణంగా ఎక్కువ మంది విద్యార్థులను చేర్చుకునేందుకు ఇబ్బందిగా ఉందని తెలియజేశారు. వెంటనే యూనివర్సిటీ వీసీతో మాట్లాడిన ఎంపీ సమస్య త్వరగా పరిష్కరించాలని కోరారు. ఫలితంగా నైలెట్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి.

ప్రపంచ పోటీతత్వాన్ని ఎదుర్కొనేలా..

ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు పోటీపడి ఉన్నత స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వంతో పోరాటి నైలెట్ సంస్థను సాధించాం. యువతకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన శిక్షణ అందించడం ద్వారా ప్రస్తుత గ్లోబల్ మార్కెట్ అవసరాలకు తగినట్లు వారి నైపుణ్యాన్ని పెంపొందించి, ఉన్నత స్థాయి ఉపాధి అవకాశాలు పొందేలా నైలెట్ కీలక పాత్ర పోషించనుంది. స్థానికంగానే ఆధునిక సాంకేతిక శిక్షణ పొందే అవకాశాలు లభించడం వల్ల యువతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగుపడతాయి. ఈ కేంద్రం ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంకేతిక శిక్షణ అందించనున్నారు. నైలెట్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తాం.

–ఎం గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

బాలకృష్ణ వ్యాఖ్యలపై నిరసన



తిరుపతిలో ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు

తిరుపతి మంగళం : జేబులో మెంటల్ సర్టిఫికెట్ పెట్టుకుని అభిమానులు, పార్టీ వాళ్ల అన్న తేడా లేకుండా చెంపలు పగలగొట్టే బాలకృష్ణ ఒక పెద్ద సైకో అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఇంటికి వచ్చిన చిరంజీవిని సత్కరించి సినీ పెద్దలను గౌరవించిన గొప్ప మనసున్న నేత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి అన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలపై తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం పార్టీ నాయకులు బాలకృష్ణ డౌన్ డౌన్ అంటూ నిరసన వ్యక్తం చేశారు. దీంతో వందల మంది పోలీసులు మోహరించి నిరసనను అడ్డుకుని ఫ్లెక్సీలను లాగేసుకున్నారు. ఈ సందర్భంగా మల్లం రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ.. తన సెక్యూరిటీపై కాల్పులు జరిపిన బాలకృష్ణను నందమూరి తారక రామారావును చూసి కాపాడిన వ్యక్తి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని గుర్తు చేశారు. స్వయాన తన బావ బాలకృష్ణకు మతిస్థిమితం లేదని తాను రచించిన ఓ పుస్తకంలో చెప్పారన్నారు. అఖండ సినిమాపై జగనన్నను బాలకృష్ణ కలవాలంటే అంతపెద్ద మనిషి మన దగ్గరికి రావడం ఏమిటని, అతను ఏమి అడిగితే అది చేసేయండని సినిమాటోగ్రఫీ మంత్రి పేర్నినానికి చెప్పిన గొప్ప గుణం జగనన్నదన్నారు. అలాంటి నాయకుడిపై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం అతడి నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తుడా వెంకటరెడ్డి, గోపాల్‌రెడ్డి, లవ్లీ వెంకటేష్, తలారి రాజేంద్ర, కార్పొరేటర్ అనీష్‌రాయల్, పార్టీ యువజన విభాగం నాయకులు ఉదయ్ వంశీ, మల్లం రవికుమార్, దినేష్‌రాయల్, మద్దాలిశేఖర్, పసుపులేటి సురేష్, రామకృష్ణారెడ్డి, శాంతారెడ్డి, పునీత, పుష్పలత పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులను బలవంతంగా లాగేస్తున్న పోలీసులు

బాలకృష్ణ తాగి అసెంబ్లీకి వెళ్లాడేమో!

రేణిగుంట: ఎమ్మెల్యే బాలకృష్ణ మద్యం సేవించి అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాడా..? అనే అనుమానం వస్తోందని మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. విజయవాడ నుంచి శుక్రవారం రాత్రి రేణిగుంటకు చేరుకున్న ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ప్రతి ఒక్కరికీ దేవాలయం లాంటిదని, అలాంటి ప్రదేశంలో బాలకృష్ణ మాట్లాడిన మాటలను ప్రతి ఒక్కరూ ఆలోచిస్తున్నారని తెలిపారు. మానవత్వం, కృతజ్ఞత అనేది బాలకృష్ణకు ఉంటే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై అలాంటి మాటలు మాట్లాడరన్నారు. కౌరవుల సభలో ద్రౌపదిని అవమానించి ఆనందించినట్లు అసెంబ్లీలో అభివృద్ధిని పక్కనపెట్టి జగన్ జపం చేస్తున్నారని అన్నారు. బాలకృష్ణ చేసిన పనికి రాజశేఖరరెడ్డి తలుచుకుని ఉంటే జీవితాంతం జైల్లో ఉండేవారన్నారు. మానవత్వం చూపిన కుటుంబంపై ఈ విధంగా మాట్లాడడం తగదన్నా రు. జగన్‌మోహన్‌రెడ్డి కూడా బాలకృష్ణ అభిమానే అని.. అలాంటి వ్యక్తిపై వ్యక్తిత్వం చంపుకొని మాట్లాడడం బాధాకరమన్నారు. అయితే సినీ నటుడు చిరంజీవి హుందాతనంతో వెంటనే స్పందించారని అన్నారు. చిరంజీవి స్పందించకుండా ఉంటే ప్రజల్లోకి వేరే విధంగా వెళ్లి ఉండేదన్నారు. మెగాస్టార్ చిరంజీవి లాగానే పవన్ కళ్యాణ్ కూడా నడుచుకుంటే బాగుంటుందని హితవు పలికా రు. బాలకృష్ణ మెంటల్ వల్ల ఆ విధంగా మాట్లాడాడ లేక తాగేసి అసెంబ్లీకి వచ్చి మాట్లాడాడా..? అనేది రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న నారాయణస్వామి

బాలకృష్ణ.. నోరు అదుపులో పెట్టుకో

– మండిపడిన వైఎస్సార్‌సీపీ నేతలు

వాకాడు : తన స్వార్థ రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులపై నందమూరి బాలకృష్ణ అసెంబ్లీ సాక్షిగా నీచ పదజాలంతో మాట్లాడిన దిగజారుడు వ్యాఖ్యలపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన వాకాడులోని తన నివాసంలో కోట, వాకాడు, చిట్టమూరు మండల వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చంద్రబాబు స్క్రిప్టుతోనే అసెంబ్లీలో లేని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేశారని, నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. బాలకృష్ణను అవమానించాలనే ఉద్దేశంతోనే చంద్రబాబు ప్రత్యేక స్క్రిప్టు తయారు చేశారన్న సంగతి తెలుసుకోవాలన్నారు. కూటమి నేతలు అవాకులు, చవాకులు మాని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రామ్‌కుమార్‌రెడ్డి హితవుపలికారు.



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నీవే ఒక పెద్ద సైకో

సూళ్లూరుపేట : అయ్యా బాలకృష్ణా.. ఈ రాష్ట్రంలో నీవే ఒక పెద్ద సైకో.. ? నీ ఇంట్లో కాల్పులు జరిగితే ఆ కేసులో నిన్ను కాపాడిందెవరో అప్పుడే మరిచిపోయావా అని సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య ఫైర్ అయ్యారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆయన సంస్కారానికి నిదర్శనమన్నారు. పవన్ కల్యాణ్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే అక్కసుతో ఇలా మాట్లాడి ఉంటావని మేమంతా అనుకుంటున్నామన్నారు. భాధ్యత కలిగిన ఎమ్మెల్యేగా, ఒక సినిమా హీరోగా సమాజానికి ఏమి మెసేజ్ ఇస్తున్నావో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడటం నేర్చుకోవాలని లేదంటే తగిన రీతిలో బుద్ధి చెబుతామని అన్నారు. ఇప్పటికైనా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.



కిలివేటి సంజీవయ్య.

సజ్జల రామకృష్ణారెడ్డికి ఘన స్వాగతం




సజ్జల రామకృష్ణారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

రేణిగుంట : చిత్తూరు ఉమ్మడి జిల్లా పర్యటన నిమిత్తం శుక్రవారం రాత్రి విజయవాడ నుంచి వందేభారత్ రైల్లో రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించి, స్వాగతం పలికారు. సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు మాజీ మంత్రి నారాయణస్వామి వచ్చారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆలయ మాజీ చైర్మన్ తారక శ్రీనివాసులు, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి వయ్యాల కృష్ణారెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షుడు గంగారి రమేష్, జడ్పీటీసీ సంధ్యారాణి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఏర్పేడు మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్ రెడ్డి, ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనేటి రమణయ్య యాదవ్, ఎంపీపీ శ్రీనివాసులు యాదవ్, మైనార్టీ సెల్ స్టేట్ సెక్రటరీ మహమ్మద్ రసూల్, సర్పంచ్ మునిశేఖర్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ హసన్ సాహెబ్, వైస్ సర్పంచ్ ఇర్ఫాన్, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉదయ్ వంశీ, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మల్లం రవికుమార్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల నుంచి విరాళాలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో స్కూల్స్ శిథిలావస్థకు చేరుకుంటే, వాటి మరమ్మతులకు మీ పరిధిలోని పరిశ్రమల నుంచి విరాళాలు సేకరించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సీడీపీవోలకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నెలవారీ సప్లిమెంటరీ న్యూట్రిషన్ ఫుడ్ కమిటీ సమావేశం చేపట్టారు. జేసీ మాట్లాడుతూ పరిశ్రమలు ఇచ్చిన విరాళాల నుంచి అంగన్‌వాడీ స్కూల్స్‌ను బాగుచేయించుకోవాలని సూచించారు. బియ్యం, కంది పప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు, బాలామృతం , న్యూట్రిషన్ కిట్లు ఎలా ఉన్నాయో తరచూ పరిశీలన చేపట్టాలని ఐసీడీఎస్ పీడీ వసంత బాయిని ఆదేశించారు. గుడ్లు సకాలంలో అందించకుంటే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ స్కూల్‌కు రేషన్ దుకాణం దూరంగా ఉంటే రీమ్యాపింగ్ చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో శేషాచలం రాజు హాజరయ్యారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



పాకాల : గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. శుక్రవారం స్థానిక రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉన్న వ్యక్తి గుర్తు తెలియని రైలు ఢీకొని రైల్వే స్టేషన్‌కు సమీపంలోని ఉప్పరపల్లి సమీపంలోని రైలు పట్టాలపై మృతిచెంది పడి ఉన్నాడని తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని, మృతుడు తెలుపు రంగుపై నల్ల గీతలు ఉన్న చొక్కా, బ్లూ రంగు లోయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు స్థానిక రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

కళాశాల భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి



రాజేంద్రప్రసాద్ (ఫైల్)

చంద్రగిరి : కళాశాల భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండల పరిధిలోని ముంగిళిపట్టు హరిజనవాడకు చెందిన రాజేంద్ర ప్రసాద్(43), నరసింగాపురం సమీపంలోని కేఎంఎం కళాశాలలో కొన్నేళ్లుగా ఎలక్ట్రీషియన్, ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం కళాశాల భవనంలోని 2వ అంతస్థులో పైపు లీకేజీ కావడంతో పైపు మరమ్మతు చేస్తూ భవనంపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కళాశాల యాజమాన్యం తిరుపతి రుయాకు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు . మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మద్యం మత్తులో బ్యారేజ్‌లో దిగి...



యువకుడిని సురక్షితంగా బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వాకాడు : వాకాడుకు చెందిన పనబాక ప్రసన్న అనే యువకుడు శుక్రవారం మద్యం మత్తులో స్వర్ణముఖి బ్యారేజ్ గేట్ల రోప్‌లను పట్టుకుని లోపలికి దిగాడు. స్థానికుల వివరాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం బ్యారేజ్ గేట్ల బెడ్‌పై పడుకుని నిద్రించడం అందరిని కలవరానికి గురిచేసింది. అగ్నిమాప క శాఖ అధికారులు, సిబ్బంది నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని చాకచక్యంగా యువకుడిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం యువకుడిని స్థానిక పోలీసులకు అప్పజెప్పారు.

100 రోజులుగా చెవిరెడ్డి అక్రమ నిర్బంధం

– నేతలతో కిటకిటలాడిన విజయవాడ ఏసీబీ కోర్టు

తిరుపతి రూరల్ : కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షతో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అక్రమంగా లిక్కర్ కేసులో అరెస్టు చేసి జైలులో నిర్బంధించి శంద రోజులు దాటింది. జూన్ 18న పార్టీ నేతలు చెవిరెడ్డిని చూసేందుకు విజయవాడకు తరలివెళ్లారు. చంద్రగిరి ప్రజలంతా ఆయన ఎప్పుడు బయటకు వస్తారా..? అని ఎదురుచూస్తుంటే పార్టీ నేతలు ఆయనను జైలు నుంచి కోర్టుకు తీసుకొచ్చిన ప్రతిసారీ విజయవాడకు వెళ్లి ఆయనతో మాట్లాడి వస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా చంద్రగిరి ప్రజలు ఆయన కుటుంబానికి అండగా నిలబడతారని, ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్ మొత్తం చెవిరెడ్డి వెంట నడుస్తుందని స్పష్టం చేస్తున్నారు. చెవిరెడ్డి స్పందిస్తూ ''వారు చేస్తున్న తప్పులు అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది.... రాజకీయాల్లో తప్పుడు కేసులు పెట్టడం సరి కాదు.. వారు చేస్తున్నారు.. మనకు తప్పదు భరించాలి..'' అంటూ క్యాడర్ లో ధైర్యం నింపారు. కూటమి ప్రభుత్వం చెవిరెడ్డిపై చూపించే కక్షను చంద్రగిరిలో ప్రతి ఇంటికీ తెలియజేస్తామని అభిమానులు ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. రోజులు గడిచే కొద్దీ చెవిరెడ్డిని చూడటానికి ఏసీబీ కోర్టు వద్దకు వెళ్లే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతుండటంతో అక్కడి కోర్టు హాలు చంద్రగిరి ప్రజలతో కిక్కిరిస్తోంది. దీనికితోడు రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కూడా అదే కోర్టుకు వస్తుండటంతో ఆయనను చూడటానికి వచ్చే వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటోంది.



కోర్టుకు తీసుకొచ్చిన చెవిరెడ్డిని కలుసుకున్న పార్టీ నేతలు

అఖిల భారత ఎన్‌సీసీ ట్రెక్కింగ్ యాత్ర ప్రారంభం



ట్రెక్కింగ్ యాత్రను ప్రారంభిస్తున్న కమాండర్ కల్నల్ సతీందర్ దాహియా

తిరుపతి సిటీ: ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అఖిల భారత ఎన్‌సీసీ ట్రెక్కింగ్ యాత్ర శుక్రవారం ప్రారంభమైంది. ఈ మేరకు తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దాహియా ట్రెక్కింగ్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 8 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ యాత్రలో పాల్గొంటారని తెలిపారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, అండమాన్, పాండిచ్చేరి, కేరళ, లక్షద్వీప్, మహారాష్ట్ర, కర్ణాటక, గోవా నుంచి మొత్తం 509 ఎన్‌సీసీ క్యాడెట్లు, 15 అసోసియేట్ అధికారులు ఈ ట్రెక్కింగ్ యాత్రలో పాల్గొంటున్నారని తెలిపారు. శేషాచలం బయోస్పియర్ రిజర్వ్, పరిసర ప్రాంతాల్లో ఈ ట్రెక్కింగ్ సాగుతుందని తెలియజేశారు.